# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 30-10-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- మొంథా తుఫాను కారణంగా రాష్ట్రానికి సుమారు 5 వేల 265 కోట్ల రూపాయల మేర నష్టం వాటిల్లిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.
- తుఫాను వల్ల నష్టపోయిన రైతులను ప్రభుత్వం అని విధాలా ఆదుకుంటుందని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ హామీ ఇచ్చారు.
- తుఫాను బాధితులకు ఆర్థిక సహాయంతో పాటు నిత్యావసర సరకులు పంపిణీ చేస్తున్నామని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు.
- అల్పపీడనంగా బలహీనపడిన మొంథా తుఫాను దక్షిణ చత్తీస్‌గఢ్ మీదుగా ఉత్తర వాయువ్య దిశగా కదులుతోందని వాతావరణ కేంద్రం వెల్లడించింది.

===========================

మొంథా తుఫాను కారణంగా రాష్ట్రానికి సుమారు 5 వేల 265 కోట్ల రూపాయల మేర నష్టం వాటిల్లిందని ప్రాథమికంగా అంచనా వేసినట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. అమరావతిలో ఈ రోజు తుఫాను నష్టంపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ.. వ్యవసాయ రంగానికి 829 కోట్ల రూపాయలు, ఆర్ అండ్ బీకి 2,079 కోట్ల రూపాయల మేర నష్టం వాటిల్లిందని వెల్లడించారు. సాంకేతికతను వినియోగించి తుఫాను ప్రభావంతో కలిగే నష్టాన్ని తగ్గించ గలిగామని ముఖ్యమంత్రి వివరిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

===========================

మొంథా తుపాను వల్ల నష్టపోయిన రైతులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ తెలిపారు. కృష్ణా జిల్లా అవనిగడ్డ నియోజకవర్గంలో పర్యటించిన ఉపముఖ్యమంత్రి తుఫాను కారణంగా దెబ్బతిన్న పంటలను ఈరోజు పరిశీలించారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా 1.38 లక్షల హెక్టార్లలో పంట

నష్టం వాటిల్లిందని తెలిపారు. ప్రభుత్వం ముందస్తు సన్నద్ధతతో తుఫాను నష్ట తీవ్రతను  తగ్గించాగలిగామని, దెబ్బ తిన్న రహదారులకు మరమ్మతులు చేపడుతున్నామన్నారు. పల్లపు ప్రాంతాల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించడంతో పా.. అంటు వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో పారిశుధ్య ప్రక్రియను ప్రారంభించామని, పునరావాస కేంద్రాల నుండి ఇంటికి వెళ్లే బాదితులకు ఆర్థిక సాయాన్ని కూడా అందచేస్తున్నట్లు పవన్ కళ్యాణ్ తెలిపారు.

===========================

తుఫాను బాధితులకు ఆర్థిక సహాయంతో పాటు, నిత్యావసర సరకులు పంపిణీ చేస్తున్నామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. గుంటూరు జిల్లా తెనాలిలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలలో 649 కుటుంబాలకు నిత్యావసర సరకులను మంత్రి ఈ రోజు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పునరావాస కేంద్రాలలో నిర్వాసితులకు ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. తుఫాను సమయంలో ప్రభుత్వం సహాయక శిబిరాలను ఏర్పాటు చేయడం వలన ప్రాణ నష్టాన్ని నివారించగాలిగమని మంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 34 సెకన్లు)

===========================

యువతకు నైపుణ్య శిక్షణ ఇస్తూనే.. వారి ఉన్నత విద్యకు సహకరించేలా ప్రభుత్వం అండగా నిలుస్తుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో నైపుణ్యాభివృద్ధి శిక్షణపై ముఖ్యమంత్రి ఈరోజు  సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... 'నైపుణ్యం' పోర్టల్ రాష్ట్రంలో ఉద్యోగాల కోసం ఎదురుచూసే వారికి ఒక మార్గంగా ఉండాలని అధికారులకు సూచించారు. 2029 నాటికి 20 లక్షలు ఉద్యోగాలు కల్పించాలన్న ప్రభుత్వ సంకల్పాన్ని సాకారం చేసేలా అధికారులు కృషి చేయాలన్నారు. ఇకపై ప్రతీ నెలా, ప్రతీ నియోజకవర్గంలో జాబ్ మేళాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. నవంబర్ లో విశాఖలో జరిగే భాగస్వామ్య సదస్సు నాటికి 'నైపుణ్యం' పోర్టల్ ప్రారంభించి, అందుబాటులోకి తీసుకురావాలన్నారు. నైపుణ్యాభివృద్ధి శిక్షణ పొందిన వారికి ఇక నుంచి అధికారికంగా ధృవపత్రాలు జారీ చేయాలని ముఖ్యమంత్రి సూచించారు.

విరామం

===========================

అల్లూరి సీతారామరాజు జిల్లాలో మొంథా తుఫాను ప్రభావం ఇంకా కొనసాగుతూనే ఉంది. ఈరోజు తెల్లవారుజాము నుండి ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో వాగుల ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పాడేరు - విశాఖపట్టణం మార్గంలో వంజంగి కాంతమ్మ వ్యూ పాయింట్ ఘాట్ రోడ్డులో కొండ చరియలు విరిగిపడి రహదారి కొట్టుకుపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఇప్పటికే అరకు, పాడేరు, చింతపల్లి ఘాట్ రోడ్లను పూర్తిగా మూసివేసి అత్యవసర పరిస్థితిలో మాత్రమే రాకపోకలకు అనుమతిస్తున్నారు. వాగులు వంకలు పొంగి ప్రవహించడంతో ప్రజలు ఎవరూ వాటిని దాటే ప్రయత్నం చేయవద్దని, సురక్షిత ప్రాంతాలలో ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

===========================

తెలంగాణ రాష్ట్రంలో కురిసిన వర్షాలకు ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలు వద్ద మున్నేరు నదికి వరద ఉధృతి పెరుగుతోంది. ఈ నేపథ్యంలో మున్నేరుతో పాటు కృష్ణానదిలో వరద ప్రవాహాన్ని నిరంతరం పర్యవేక్షిస్తున్నామని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. ఈరోజు పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర బాబు, నందిగామ శాసనసభ్యులు తంగిరాల సౌమ్యతో కలిసి కలెక్టర్ వివిధ ప్రాంతాల్లో మున్నేరు వరద పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా లక్ష్మీశ మాట్లాడుతూ... కృష్ణా, మున్నేరు, కట్టలేరు, వైరా, పాలేరులోని ప్రవాహాలపై ప్రత్యేకంగా దృష్టిపెట్టామని.. మున్నేరుకు ఇరువైపులా ఉన్న 40 గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశామని తెలిపారు. ఎవరికీ ఎక్కడా ఎలాంటి ఇబ్బందిలేకుండా ముందు జాగ్రత్తలు తీసుకున్నామని.. గ్రామ సచివాలయాలు, పాఠశాలలను సిద్ధంగా ఉంచామని అన్నారు.

============================

సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకుని ముందస్తుగా తిరుపతిలో జాతీయ సమైక్యత ర్యాలీని ఈరోజు నిర్వహించారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఉపకులపతి టి. నరసింగరావు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. బాలాజీకాలనీ సర్కిల్ నుండి తుడా కార్యాలయం వరకు చేపట్టిన ఈ ర్యాలీలో విద్యార్థులు, వైద్య విద్యార్థులు, సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొని ఏక్ భారత్.. శ్రేష్ట్ భారత్.. అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఐక్యతతో పాటు స్వచ్ఛత, మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ప్రభావాలను ఈ ర్యాలీ ద్వారా తెలియజేశామని తిరుపతి జిల్లా యువజన అధికారి ప్రదీప్ కుమార్ పేర్కొంటూ...

(వాయిస్ 26 సెకన్లు)

============================

పశ్చిమ గోదావరి జిల్లాలో తుఫాను పంట నష్టం అంచనాలను ప్రభుత్వానికి సమర్పించి, నిబంధనల మేరకు రైతులకు సహాయం అందించేలా కృషి చేస్తానని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. తాడేపల్లిగూడెం మండలంలోని కృష్ణాయపాలెం, పెంటపాడు మండలంలోని రావిపాడు, గణపవరం మండలంలోని చిలకంపాడు గ్రామాలలో ఈదురు గాలులకు నేలకొరిగిన పంట పొలాలను తాడేపల్లిగూడెం శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ తో కలిసి కలెక్టర్ ఈరోజు పరిశీలించారు.

============================

మహిళల వన్డే ప్రపంచ కప్-2025లో భాగంగా ముంబై వేదికగా ఈరోజు భారత్ ఆస్ట్రేలియా జట్ల మధ్య రెండవ సెమీఫైనల్ క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది. తొలుత టాస్ గెలిచిన ఆస్ట్రేలియా 40 ఓవర్లు పూర్తయ్యే సరికి 5 వికెట్ల నష్టానికి 254 పరుగులు చేసింది.

============================

అల్పపీడనంగా బలహీన పడిన మొంథా తుఫాను దక్షిణ చత్తీస్‌గఢ్ మీదుగా ఉత్తర వాయవ్య దిశగా కదులుతోందని అమరావతిలోని వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీనికి అనుబంధంగా సముద్ర మట్టానికి 7.6 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని పేర్కొంది. దీని ప్రభావంతో రాష్ట్రంలో రానున్న రెండు రోజుల పాటు తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం అధికారిణి జి. లక్ష్మి తెలియజేస్తూ....

(వాయిస్ 26 సెకన్లు)

============================
============================